ఆగిన వాహనాన్ని ఢీకొన్న బస్సు

★ వ్యాపారి మృతి ★ 25 మందికి గాయాలు

పూతలపట్టు, న్యూస్‌టుడే: చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిపై పి.కొత్తకోట సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఆగి ఉన్న వాహనాన్ని బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా.. 25 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన నలుగురు వ్యాపారులు బంగారుపాళ్యం మార్కెట్‌లో మామిడి కాయలు కొనుగోలు చేసి.. టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో వారు రోడ్డు పక్కన నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో ఓ కంపెనీకి చెందిన బస్సు సిబ్బందితో బంగారుపాళ్యం నుంచి పాకాల వస్తూ ఆగిన మామిడికాయల వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న గుంటూరుకు చెందిన నరసింహులు(50) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు ముందు భాగం దెబ్బతినడంతోపాటు అందులోని 23 మంది, రోడ్డుపై నిద్రిస్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరికి పి.కొత్తకోట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్ల లక్ష్యం చేరుకునేనా?

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 21న రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుని జిల్లాలకు లక్ష్యాలను నిర్దేశించింది. గడువు సమీపిస్తున్నా ప్రజలు కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో మూడు రోజుల్లో లక్ష్యం మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చూడాలని కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ స్వర్ణ గ్రామ, వార్డు శాఖ అధికారులతో పాటు మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులను సమన్వయం చేసుకుని యువత, మహిళలు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనేలా పేర్లు నమోదు చేయిస్తున్నారు.

42.76 శాతం పెండింగ్ జిల్లాలో 4,96,707 మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటికి సుమారు 2.50 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 57.24 శాతం మంది నమోదయ్యారు. మరో 42.76 శాతం మంది నమోదు కావాల్సి ఉంది. గుంటూరు నగరంలో 1,53,019 మంది పేర్లను రిజిస్టర్ చేయాల్సి ఉండగా.. మూడో వంతు నమోదు పూర్తి చేశారు. తెనాలి పట్టణంలో లక్ష్యం (33,499 మంది) చేరుకుని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. చేబ్రోలు, పెదకాకాని మండలాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

ఓటీపీతో సమస్య యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారి వివరాలు స్మార్ట్ ఫోన్‌లో నమోదు చేసినపుడు ఓటీపీ జనరేట్ అవుతుంది. అయితే ఓటీపీ చెప్పేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. ఓటీపీ నమోదు చేస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది నిర్దేశించిన రిజిస్ట్రేషన్లను పూర్తి చేసేందుకు ఓటీపీ ప్రతిబంధకంగా మారుతోందని పేర్కొంటున్నారు. రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయిలో యోగాంధ్ర నిర్వహిస్తుండటంతో జిల్లా నుంచి ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మరో 1.86 లక్షల మంది పేర్లు నమోదు చేయించి.. వారందరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా చూడాల్సి ఉండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ

ప్రారంభించిన సంచార వైద్య వాహనం వద్ద పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో సంచార వైద్య వాహనం అందుబాటులోకి తీసుకొచ్చామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో కలెక్టరేట్‌లో సంచార వైద్య వాహన సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ సాధారణ వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య సూచనలు.. ప్రజలకు వారి ప్రాంతంలోనే అందుతాయన్నారు. జిల్లాలో ఇప్పటికే రెండు సంచార వైద్య వాహనాలు సేవలు అందిస్తున్నాయన్నారు. ఏడాదికి వీటి నిర్వహణకు రూ. 45 లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వైద్య సేవలను వారి ఇంటి వద్దకు తీసుకురావడమే లక్ష్యమన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్ సూచనలు మేరకు ఈ సంచార వైద్య వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం.. పలువురి జీవితాల్లో వెలుగు

నాగ వెంకట దుర్గ శ్రీనివాస్ (పాత చిత్రం)

గుంటూరు వైద్యం, కరెన్సీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: ఓ ప్రభుత్వ ఉద్యోగి జీవన్మృతుడిగా మారగా.. ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చి.. పలువురి జీవితాల్లో వెలుగు నింపారు. విజయవాడ మారుతినగర్‌కు చెందిన పామర్తి నాగ వెంకట దుర్గ శ్రీనివాస్(48) ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 10న కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా.. తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే ఆయన్ను విజయవాడలోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల కృషి చేసినా ఫలితం లేకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సమన్వయకర్తల చొరవతో భార్య వెంకట నాగలక్ష్మి, తల్లి జయలక్ష్మి, కుమారులు మోహిత్ బాబ్జి, చరణ్ బాబ్జిలు జీవన్మృతుడి అవయవదానానికి అంగీకరించారు. దీంతో గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో ఈమేరకు ఏర్పాట్లు చేశారు. కార్నియాలు ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు, కాలేయం, ఒక మూత్రపిండం గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి, మరో మూత్రపిండం ఎన్ఆర్ఐ ఆసుపత్రికి కేటాయించారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఎండీ పి.రమేష్‌బాబు కుటుంబ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు.

❖ శ్రీనివాస్ ఆకాల మృతి పట్ల ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందేలా చూస్తామని ఎక్సైజ్ పోలీసు అధికారులు తెలిపారు.

శశాంక్‌కు లోకేశ్ భరోసా

శశాంక్ తల్లిదండ్రులతో మంత్రి నారా లోకేశ్

విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లా కొండపర్వ గ్రామానికి చెందిన తలసీమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడు వంగూరి శశాంక్(7) తన తల్లిదండ్రులు వంగూరి నాగార్జున, ఎస్తేరురాణితో కలసి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ని బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి అర్జీని అందజేశారు. వైద్యం చేయించి ప్రాణాలు కాపాడాలని కోరారు. శిశువుగా ఉన్నప్పటి నుంచే మేజర్ తలసీమియాతో తీవ్ర ఇబ్బందులకు గురికావడం, ముఖ్యంగా నెలకు రెండు సార్లు రక్తం ఎక్కించాల్సి వస్తుందని వైద్యఖర్చులు భరించలేక పోతున్నామని తల్లిదండ్రులు బోరున విలపిస్తూ, తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని మంత్రిని కోరారు. చలించిన లోకేశ్ వైద్యఖర్చులు పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందని శశాంక్‌కి సరైన వైద్యం అందేలా ఆరోగ్యం కుదుటపడేలా చేస్తామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ ఇది తమ బాధ్యత అని మంత్రి లోకేష్ తెలిపారు.

దేవాదాయ శాఖ

శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము

అనంతవరం గ్రామం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం, అనంతవరం గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము పునర్ నిర్మాణము కొరకు టెండర్ల (సి.జి.ఎఫ్ ఫండ్) ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.inలో చూడవచ్చు.

సంప్ర: కార్యనిర్వహణాధికారి, శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, అనంతవరం గ్రామం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

డ్రైస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్సి మేడపీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ షాహెన్షా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786 ఆస్తి తనిఖీ కొరకు : 94945 26440

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: మెస్సర్స్ విజయ ఫుడ్ ప్రొడక్ట్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి ముక్కామల వెంకట విజయ లక్ష్మి, భర్త : ముక్కామల బాల వీర రాఘవయ్య, అపి.ఎస్.నెం. 13-46, సబ్ స్టేషన్ ఎదురుగా, నిదమానూరు, కృష్ణాజిల్లా - 521104. హామీదారులు: 1. శ్రీ బత్తుల వీరాంజనేయ సాయి శివ ప్రసాద్, తండ్రి : బి. కూర్మయ్య, డి.నెం. 7-6-231/బి, వసంతరాయపురం, 1వ లేన్, అరండల్‌పేట (పోస్ట్), గుంటూరు - 522002. 2. శ్రీమతి ముక్కామల వెంకట విజయలక్ష్మి, భర్త : ముక్కామల బాల వీర రాఘవయ్య, 2వ అంతస్తు, ఆల్ఫా హౌస్ ఎదురుగా, 1వ క్రాస్ రోడ్డు, రోడ్డు నెం.5, వెటర్నరీ కాలనీ, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా - 520008. వారు డిమాండ్ నోటీసు తేది.16-12-2024 ప్రకారం తేది.16-12-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.49,50,381/- (అక్షరాల నలభై తొమ్మిది లక్షల యాభై వేల మూడు వందల ఎనభై ఒక్క రూపాయలు మాత్రమే) + తేది.17.12.2024 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది ఆలానే" "ఏది ఎలా వుంటే ఆలానే" "ఆక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై తేది.10-07-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించబడునది.

షెడ్యూలు ఆస్తి వివరములు

గుంటూరు జిల్లా, గుంటూరు, 1వ లైన్, వసంతరాయపురం 1వ లైన్, అరండల్‌పేట 1వ లైన్ చివర, కొత్త అసెస్మెంట్ నెం.13009, పాత అసెస్మెంట్ నెం.8587, బ్లాక్ నెం.12, కొత్త వార్డు నెం.5, మున్సిపల్ పాత వార్డు నెం.3, వోర్ నెం.7-6-231, టి.ఎస్.నెం.718 లోని 388 చదరపు మొత్తం స్థలంలో187.6 చదరపు లేదా 156.76 చదరపు వస్తీర్ణంలో నిర్మించిన 925 చదరపు ఫ్లింత్ ఏరియాతో గల ఆర్‌సిసి దాబా ఇల్లు యావత్తు ఆస్తి గుంటూరు జిల్లా, గుంటూరు ఇన్‌సెంట్రల్ రిజిస్ట్రేషన్ డీడ్ నెం. 3476/2015, తేది.04.04.2015 ప్రకారం శ్రీ బత్తుల వీరాంజనేయ సాయి శివ వరప్రసాద్, తండ్రి: బి. కూర్మయ్య గారికి చెందినది. హద్దులు: తూర్పు: గంజి పాపని & వరదేశి సుధాకరరావు గార్ల ఇల్లు-32.02 అడుగులు, దక్షిణం : బత్తుల వెంకట శివ పవన్ కుమార్, బత్తుల వీరాంజనేయ సాయి శివ వరప్రసాద్ గార్ల ఆస్తి-52.06 అడుగులు, పడమర : మున్సిపల్ రోడ్డు-32.02 అడుగులు, ఉత్తరం : బత్తుల వీరాంజనేయ సాయి శివ వరప్రసాద్ గారి ఆస్తి - 52.06 అడుగులు.

రిజర్వు ధర : రూ.52,00,000/- ధరావత్తు : రూ.5,20,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 10-07-2026, సమయం : ఉ॥ 11.00 గంటల నుండి సా॥ 04.00 గంటల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 నిముల అపరిమిత పొడిగింపు కలదు

పై ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:19-06-2026 నుండి 09-07-2026 వరకు ఉ॥10.00 గంటల నుండి సా॥ 04.00 గంటల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయంది, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీస్ ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డరు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డరు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఈమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించబడునది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రావిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 17-06-2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జనగణనతోపాటు కులగణన జరపాలి

డెడికేటెడ్ కమిషన్‌కు బీసీ సంఘాల వినతి

రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న జనగణనతో పాటు కులగణన కూడా జరపాలని బీసీ సంఘాల ప్రతినిధులు విన్నవించారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ నిబంధనల అమలుకు సంబంధించి బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కలెక్టరేట్‌లో బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి బుధవారం వినతులు స్వీకరించి త్వరలో క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తానని పేర్కొన్నారు. తొలుత ఆయన అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పూర్తి వివరాలు, ప్రస్తుతం 2026లో ఎన్నికల నిర్వహణకు పంచాయతీలు, మున్సిపల్ అధికారులు సిద్ధం చేసిన వివరాలు సైతం అందించాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సంచార జాతుల వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. బందారుపల్లి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరి పేరు చెబితే.. వారి పేరును చూపిస్తారని, ఇలా అనేక గ్రామాల్లో జరుగుతుందన్నారు. అక్కడ రిజర్వేషన్లు అమలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో భాజావలి, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మయూరి, డీపీవో నాగసాయికుమార్, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

వినతులు ఇవీ..

❖ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ బీసీ కులాల జనగణనను శాస్త్రీయంగా నిర్వహించి సుప్రీంకోర్టు 50 శాతం పరిమితిని తొలగింపజేయించి స్థానిక సంస్థల రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు పెంచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. జనగణనలో ఓబీసీల గృహ గణన లెక్కించే కాలమ్ లేకపోవడం సరికాదన్నారు.

❖ సమగ్ర బీసీ కులగణన పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ వినతిపత్రం అందించారు. ❖ రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తేనే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాజిక న్యాయం జరుగుతుందని సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు కోరారు. ❖ ఏపీలోని బొందిలి కులస్థులను ఓబీసీలో చేర్చాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్షత్రియ ధర్మనారాయణసింగ్ వినతిపత్రం అందించారు.

బీఈడీ పరీక్షల ఫలితాల విడుదల

ఫలితాలు విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్ తదితరులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: 'ఆచార్య.. బీఈడీ ఫలితాల విడుదలెప్పుడు' పేరుతో ఈనాడులో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధికారులు స్పందించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ విడుదల చేశారు. మొత్తం 6985 మంది పరీక్ష రాయగా 5870 మంది ఉత్తీర్ణులయ్యారు. జవాబు పత్రాల పునర్మూల్యాంకన కోసం ఈనెల 29వ తేదీలోపు ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలని సీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏసీఈ రెడ్డి ప్రకాశరావు, సహాయ రిజిస్ట్రార్ కావూరి శ్రీనివాసరావు, వికాస ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎడ్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్ సర్వే వేగవంతం

నగరపాలక సంస్థ, కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సర్వే వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వే ఫారాలు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసేవిధంగా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. సర్వే విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. గుంటూరు నగరంలో అధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన నలుగురు బీఎల్‌వోలను మంగళవారం సస్పెండ్ చేయగా.. బుధవారం మరొకరిపై వేటు వేశారు.

జిల్లాలో సర్ సర్వే వివరాలు..

ఓటర్లు	18,02,074
బీఎల్‌వోలు	1,920
దరఖాస్తులు (ఈఎస్)	18,02,074
పంపిణీ చేసినవి	3,39,405
ఆన్‌లైన్‌లో నమోదు	3,987

24 నుంచి శైవక్షేత్రం వార్షిక మహోత్సవాలు

తుళ్ళూరు: అత్కాయపాలెం శైవక్షేత్ర త్రయో వింశతి 23వ వార్షికోత్సవాలు ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు క్షేత్ర పీఠాధిపతి శివస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా నదికి, రాజరాజేశ్వరీ దేవి, కోటిలింగేశ్వర స్వామి, వివిధ దేవతామూర్తులకు విశేష పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు శివస్వామి తెలిపారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

సుపరిపాలన విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న మాణిక్యరావు, నాయకులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'కూటమి ప్రభుత్వ హయాంలో కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చారు. రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజెప్పేందుకు సుపరిపాలన విజయోత్సవ సభను గురువారం నిర్వహిస్తున్నాం'.. అని తెదేపా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు వెల్లడించారు. ఈ సభను తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. తెదేపా జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆయిదేళ్ల వైకాపా పాలనలో అరాచకం రాజ్యమేలింది. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. మహిళల్ని కించపర్చడం, అస్తుల్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. కూటమి రెండేళ్ల సుపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నాం. రాజధాని అమరావతికి రక్షణ చట్టం తీసుకొచ్చాం. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన అందిస్తున్నాం. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై జగన్ విషప్రచారం చేస్తున్నారు. వైకాపా అసత్య ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడుతున్నాం. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే విజయోత్సవ సభకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి ఛైర్మన్లు పాల్గొంటారు'.. అని పేర్కొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్లలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. హోంమంత్రి అనిత పట్ల వైకాపా నేత గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఊరుకోబోమని హెచ్చరించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ వైకాపా అయిదేళ్ల పాటు చేసిన అరాచకాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్లు అధికారంలో ఉంటుందని చెప్పారు. సమావేశంలో తెదేపా నాయకులు నాయుడు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా యాగశాల తొలగింపు పనులు

పనులను ప్రారంభిస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, సునీల్‌కుమార్

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి లక్ష్మీనరసింహుని సన్నిధిలో శ్రీకృష్ణదేవరాయ మండపం, యాగశాల, గంట మండపాన్ని పునర్నిర్మించేందుకు పాత కట్టడాల తొలగింపు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ శాస్త్రోక్తంగా కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. మూడు కట్టడాల కోసం మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో రూ.6.30 కోట్లు మంజూరు చేశారు. శ్రీ కృష్ణదేవరాయ మండపాన్ని తొలగించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా రాత్రి సమయాల్లో ఈ పనులు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్, ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు, స్థానాచార్యులు నల్లూరి రామచంద్ర భట్టాచార్యులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్రూ శాస్త్రవేత్తల బది